# 21,500 స్థాయికి నిఫ్టీ

**ఇంట్రాడేలో సరికొత్త శిఖరాలకు సూచీలు**

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతో ఎఫ్ఎంసీజీ, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, బ్యాంకింగ్ రంగ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో ప్రామాణిక ఈక్విటీ సూచీలు మంగళవారం సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ 309 పాయింట్ల వృద్ధితో 71,623.71 వద్ద, నిఫ్టీ 86.4 పాయింట్లు పెరుగుదలతో 21,505.05 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేశాయి. చివరికి సెన్సెక్స్ 122.10 పాయింట్ల లాభంతో 71,437.19 వద్ద, నిఫ్టీ 34.45 పాయింట్ల లాభంతో 21,453.10 వద్ద ముగిశాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో సగం పాజిటివ్‌గా ముగిశాయి.

**స్పైస్‌జెట్ షేరు జూమ్ :** దేశీయ ఎయిర్‌లైన్స్ స్పైస్‌జెట్ షేరు భారీగా పుంజుకుంది. బీఎస్ఈ ఇంట్రాడే ట్రేడింగ్‌లో షేరు ధర 7.77 శాతం వరకు పెరిగి రూ.69.20 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసుకుంది. చివరికి 2.91 శాతం లాభంతో రూ.66.08 వద్ద ముగిసింది. దివాలా తీసిన గోఫస్ట్ ఎయిర్‌లైన్స్ కొనుగోలుకు స్పైస్‌జెట్ ఆసక్తి చూపడటం ఇందుకు కారణం.

**6 ఐపీఓలు.. అన్నీ హిట్టు:** ప్రైమరీ మార్కెట్ పబ్లిక్ ఇష్యూలతో కళకళలాడుతోంది. ప్రస్తుతం 6 కంపెనీల ఐపీఓలు సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉన్నాయి. అన్నింటికీ ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభిస్తోంది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. మోతీసన్స్ జువెలర్స్ ఆఫర్ రెండో రోజు నాటికి, ఇష్యూ సైజుకు 51.36 రెట్లు బిడ్లు లభించాయి. సూరజ్ ఎస్టేట్ డెవలపర్స్‌కు 2.42 రెట్లు, ముత్తూట్ మైక్రోఫిన్‌కు 2.83 రెట్లు సబ్‌స్క్రిప్షన్ లభించింది. కాగా, ముఫ్తీ బ్రాండ్‌నేమ్‌తో డెనిమ్ వస్త్రాలను విక్రయించే క్రెడో బ్రాండ్స్ మార్కెటింగ్ ఇష్యూ తొలిరోజు నాటికి 2 రెట్లు సబ్‌స్క్రైబ్ కాగా.. ఆర్‌బీజెడ్ జువెలర్స్‌కు 2.27 రెట్లు, హ్యాపీ ఫోర్జింగ్స్‌కు 2.31 రెట్లు బిడ్లు దాఖలయ్యాయి.

## వచ్చే ఏడాదీ తగ్గేదేలే..!

- 2024లో నిఫ్టీ 8-10 శాతం వృద్ధి
- హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ అంచనా

భారత స్టాక్ మార్కెట్ జోరు వచ్చే ఏడాదిలోనూ కొనసాగనుందని ఓ బ్రోకరేజీ సంస్థ అభిప్రాయపడింది. ప్రస్తుత స్థాయితో పోలిస్తే, 2024లో నిఫ్టీ 8-10 శాతం వరకు వృద్ధిని నమోదు చేసుకోవచ్చని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిటైల్ రీసెర్చ్ విభాగ అధిపతి దీపక్ జసానీ అంచనా వేశారు. మంగళవారం నిఫ్టీ 21,453 వద్ద ముగిసింది. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే సూచీ 17 శాతానికి పైగా వృద్ధి కనబర్చింది. వచ్చే ఏడాదిలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల ఫలితాల ప్రభావం మార్కెట్‌పై పరిమితంగానే ఉండవచ్చని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ ఎండీ, సీఈఓ ధీరజ్ రెల్లి అన్నారు. ఈ మధ్య జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మూడు రాష్ట్రాలను దక్కించుకున్న నేపథ్యంలో మోదీ సర్కారు మూడోసారి అధికారంలోకి రావచ్చన్న విశ్వాసం మదుపరులలో బలపడిందని. ప్రస్తుతం మార్కెట్లో కొనసాగుతున్న ర్యాలీకి అదీ ఒక కారణమని పేర్కొన్నారు.